క్లుప్తంగా

13న భీమడోలులో జాతీయ లోక్ అదాలత్


ప్రియదర్శిని

ఏలూరు (టూటౌన్): భీమడోలు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ భీమడోలు కోర్టులో నిర్వహించనున్నట్టు భీమడోలు మండలి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్ ప్రియదర్శిని నూతక్కి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దెందులూరు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు సంబంధించి రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, కుటుంబ, చెక్ బౌన్స్, చిట్, ఫైనాన్స్, టెలిఫోన్, ఇంటి, నీటి పన్నులకు సంబంధించిన కేసులు పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు న్యాయవాది ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 15100లో సంప్రదించవచ్చని వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి 5 వేల క్యూసెక్కుల వరద నీటిని తమ్మిలేరులోకి విడుదల చేసినందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అర్బన్ తహసీల్దార్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని తమ్మిలేరుకు వరద నీరు వస్తుందని అమీనా పేట వద్ద ఉన్న శనివారపు పేట కాజ్ వే పైకి వరద నీరు ప్రవహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాయి నగర్, తంగెళ్లమూడి అన్న క్యాంటీన్ సెంటర్, కొమడవోలు ఇందిరమ్మ కాలనీల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరద నీటి ప్రవాహం పెరిగితే తంగెళ్లమూడిలోని అన్న క్యాంటీన్ సెంటర్‌లో ఉన్న 17 కుటుంబాలను పక్కనే ఉన్న మసీదులో పునరావాసానికి తరలిస్తామని తెలిపారు.

కొల్లేరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: నాగిరెడ్డిగూడెం డ్యామ్ నుంచి నీటిని కిందికి విడుదల చేశారని, కొల్లేరు ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ విజయకుమార్ రాజు సోమవారం హెచ్చరించారు. ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అత్యవసర పరిస్థితులు అయితే తప్ప బయటకు వెళ్ల వద్దని ప్రజలకు సూచించారు. పశువులను కొల్లేరులోకి మేతకు తోలవద్దని అన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో కలిసి కలెక్టర్ కె.వెట్రి సెల్వి స్వయంగా పరిశీలించారు. పలువురు లబ్ధిదారుల ఇంటివద్ద పింఛన్లు అందజేశారు. జిల్లాలో ఉన్న 2,61,221 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.114.13 కోట్లు విడుదల చేసిందని, మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ చేంటుందని వివరించారు. వీరి వెంట డిప్యూటీ మేయర్, ఈడ చైర్మన్, కో ఆప్షన్ మెంబర్, కార్పొరేటర్, అధికారులు ఉన్నారు.

ఆదాయం లేక.. ఆటోవాలాల అవస్థలు

- 'స్త్రీ శక్తి'తో సగానికి పైగా తగ్గిన ఆదాయం
- కిస్తీలు కట్టలేక విలవిల
- గతంలో ఆదుకున్న జగన్ 'వాహన మిత్ర'

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు తొందరగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి, అవసరమైన చోట ఎక్కడానికి, దిగడానికి అవకాశం ఉండడంతో ఆటోలకు అలవాటు పడ్డారు. సుమారు 15 – 20 కిలోమీటర్ల ప్రయాణానికి ఆటోలు సౌకర్యవంతంగా ఉండేవి. ఏలూరు నగరంలో సుమారు 25 సంవత్సరాలుగా ఆటోల సౌకర్యం ఉంది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు తాజాగా కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఆటోల ఆదాయం గణనీయంగా తగ్గిపోయి ఆటోవాలాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్సు ప్రయాణానికే మొగ్గు

ఏలూరు నగరం నుంచి దెందులూరు, కైకలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు, హనుమాన్ జంక్షన్, జానంపేట, పినకడిమి, కొప్పాక వంటి ప్రాంతాలకు నిత్యం వేలాది ఆటోలు తిరుగుతున్నాయి. అలాగే నగరంలో వట్లూరు నుంచి పాత బస్టాండు, పెద్ద రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు సర్వీస్ ఆటోలు తిప్పుతూ అనేక మంది జీవనోపాధి పొందేవారు. నిరుద్యోగం నుంచి బయటపడి తమ కాళ్లపై తాము నిలబడే ప్రయత్నం చేసిన యువతకు ఆటోలు పెద్ద దిక్కుగా మారాయి. అయితే స్త్రీ శక్తి పథకాన్ని గత ఆగష్టు 15వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. పల్లెవెలుగు బస్సులు తిరిగే దెందులూరు, కైకలూరు, పెదవేగి, హనుమాన్ జంక్షన్, చింతలపూడి రూట్లలో మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారు. కొద్ది సేపు వేచి ఉన్నా సరే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఆటోల ఆదాయం సగానికి పైగా తగ్గిపోయింది.

ఉపాధికి గండి

ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రావడంతో నగరంలో దాదాపు నాలుగు వేల మంది ఉపాధికి గండి పడింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 2 వేల ఆటోల్లో కనీసం వెయ్యి ఆటోలు పాతబస్టాండు, వసంతమహల్, ఫైర్‌స్టేషన్, కొత్త బస్టాండు, శాంతినగర్, సత్రంపాడు, వట్లూరు మీదుగా సర్వీసు చేస్తున్నాయి. ఈ రూట్లలో గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, నూజివీడు వెళ్లే పల్లెవెలుగు బస్సులు అందుబాటులోకి రావడంతో మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారు. నగరం బయట అంటే కైకలూరు, దెందులూరు, హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాలకు తిప్పే మిగిలిన 2 వేల ఆటోలు సైతం స్త్రీ శక్తి పథకం కారణంగా ఎక్కేవారు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి.


నగరంలో ఆటోలు

దిక్కుతోచని స్థితి

చదువుకున్నా ఉద్యోగం రాక ఉపాధి కోసం ఆటోలు తిప్పుకుంటూ ఉపాధి పొందుతున్న అనేక మందికి ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గతంలో వివిధ రూట్లలో ఆటోలు తిప్పుతూ రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.800 వరకు ఆదాయం పొందేవారు. నేడు రోజుకు రూ.200 సంపాదించడం గగనమైపోయింది. దీంతో వాయిదాల పద్ధతిలో చెల్లించేలా రుణాలు తీసుకుని ఆటోలు తిప్పుతున్న వారిపై ప్రభావం పడింది. వారికిప్పుడు కిస్తీలు కట్టడానికి కూడా ఆదాయం రావడంలేదు.

ఆదుకున్న వాహనమిత్ర

ఆటోలు తిప్పుకునే వారికి జగన్ హయాంలో వాహన మిత్ర పథకం కొండంత అండగా నిలిచింది. ఆటోలకు ప్రతి ఏటా రవాణా శాఖ వద్ద చేయించుకునే బ్రేక్‌కు, ఆటోలకు చిన్నచిన్న మరమ్మతులకు వాహనమిత్ర పథకం రూ.10 వేలు ఎంతో ఉపయోగపడేవి. నాలుగేళ్ల పాటు రూ.10 వేలు చొప్పున నగరంలోని 4 వేల ఆటో వాలాల ఖాతాలకు జమ చేసింది. కూటమి ప్రభుత్వం ఆటో వాలాలకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ 15 నెలలు దాటినా అమలుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఆటో వాలాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుర్భరంగా మారిన జీవనం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆటో వాలాలకు గండంగా మారింది. ఆటోలు తిప్పినా ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. కనీసం పెట్రోలు ఖర్చులకు, కిస్తీలు కట్టుకోవడానికి కూడా ఆదాయం సరిపోవడం లేదు.

– జి.గోపి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి

హామీని నిలబెట్టుకోవాలి



ఆటోవాలాలకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆటోవాలాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– చత్రాల అమర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు, ఏలూరు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ అసోసియేషన్

వైభవంగా గణపతి ఉత్సవాలు


కోడేలులో గణపతి సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు


తంగెళ్లమూడిలో నిమజ్జనానికి గణనాథుడిని తరలిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నగరంలోని పలు మండపాల్లో స్వామి వారికి విశేష పూజలు చేశారు. కొన్ని మండపాల వద్ద భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. మరికొన్ని మండపాల్లో పూజలు అందుకున్న గణనాథుల విగ్రహాలను నిమజ్జనానికి భారీ రేగింపు నడుమ తరలించారు. దారిపొడవునా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోడేలు రెండో డివిజన్ ఒకటో రోడ్డులో శ్రీ గణపతి మహోత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆదివారపు పేట శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిర్ మహిళా సేవకులు 108 సార్లు హనుమాన్ చాలిసా పారాయణ, గణపతి సంకీర్తనలు, ఆలపించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గణనాథుడిని ప్రత్యేక వాహనంపై తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. తంగెళ్లమూడి సీతారామ నగర్ చెరువుగట్టుపై వేంచేసియున్న మూడు గుడుల ఆవరణలో గణనాథుని వేడుకలు ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం నగర వీధులలో ప్రత్యేక వాహనంపై స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు. పులిహోర, శనగలు, చక్కెర పొంగలి ప్రసాదం వితరణ చేశారు. స్వామి వారి సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు.

సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో అనుమతులు లేకుండా సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం హెచ్చరించారు. నగరంలోని పలు సంతాన సాఫల్య కేంద్రాలను సోమవారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుమతి లేకుండా అనధికారికంగా సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహించటం చట్టరీత్యా నేరం అన్నారు. అనుమతి లేని కేంద్రాల్లో సేవలను నిలిపివేసేలా నోటీసులు జారీ చేస్తామని, కేంద్రాల యజమానులపై చట్టం పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	40	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	32	బీట్‌రూట్	36
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	44-50	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	44	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

దెందులూరు : ఏలూరు రూరల్ మండలంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 12,083 రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో మాట్లాడారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

పెదవేగి: ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు దాటకుండా బాల్య వివాహాలు చేసుకుంటే చట్టరీత్య శిక్షర్హులని పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అన్నారు. పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్–క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సహకారంతో బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటిక ప్రదర్శించారు. పెదపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ గ్రామంలోని ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. హెచ్‌ఎం టీవీ సత్యనారాయణ, క్రాఫ్ సిబ్బంది, ఆర్.వినోద్‌కుమార్, జి రాజలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీపై 'కూటమి' దగా

దెందులూరు: డీఎస్సీ విషయంలో కూటమి ప్రభుత్వం మొదటి నుంచి మోసపూరిత విధంగానే వ్యవహరిస్తుందని ఇది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని వైఎస్సార్ సీపీ వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం మాదేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 16,347 పోస్టుల భర్తీలకు ఆన్‌లైన్‌లో కేవలం 10 వేల మందికి మాత్రమే కాల్ లెటర్లు పంపడం వెనుక ప్రభుత్వం ఆంతర్యం ఏమిటన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు.

పాఠశాల పరిశీలన

దెందులూరు: కొవ్వలి పీఎంశ్రీ జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం గుజరాత్ ఐఏఎస్ బృందం రంజిత్ కుమార్ నేతృత్వంలో సందర్శించారు. పీఎంశ్రీలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్, ఆటోమోటిక్, బీఎఫ్ఎస్ఐ లాబ్స్, పీఏఎల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. స్పోర్ట్స్, గైడ్స్ ఆక్టివిటీస్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. వారి వెంట సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏలూరు జిల్లా ఏపీఎస్ పంకజ్ కుమార్, ఏఎంఓ ఆర్.రామారావు, ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ బి.గణేష్‌కుమార్ ఉన్నారు.

శాంతించిన గోదావరి.. వీడని దిగ్బంధం

- భద్రాచలం వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం
- నాలుగో రోజు ముంపులోనే రహదారులు, తప్పని పడవ ప్రయాణం


వేలేరుపాడు: నాటు పడవపై ప్రయాణిస్తున్న రేపాకగొమ్ము గ్రామస్తులు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. సోమవారం ఉదయం 47.60 అడుగులు ఉన్న నీటి మట్టం రాత్రి 8 గంటలకు 42.90 అడుగులకు చేరింది. గోదావరి నీటిమట్టం తగ్గుతున్నా శబరి ఎగపోటు వలన వేలేరుపాడు మండలంలో అనేక గ్రామాలు ఇంకా వరద ముట్టడిలోనే ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 26 గ్రామాలు నాలుగో రోజూ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే రహదారిలో మేళ్లవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. దిగువనున్న కోయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్లగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్దారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురు మామిడి, బోళ్లపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, తదితర గ్రామాలతో పాటు మరో తొమ్మిది గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. గోదావరి వరద నీటి మట్టాలు దోబూచులాడటం వలన ఆయా గ్రామాల గిరిజనులు ఉపాధి పనులు లేక ఇళ్లలోనే ఉంటున్నారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము, రుద్రమకోట, వెళ్లే రహదారులు ఇంకా నీటిలోనే ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము గ్రామానికి వెళ్లే రహదారి ఇంకా నీటమునిగే ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బోట్లపై ప్రయాణిస్తున్నారు.

ముంపులో పొలాలు

పోలవరం రూరల్: గోదావరి ఎగపోటు నీటితో పోలవరం ప్రాంతంలో నాట్లు వేసిన పొలాలు నాలుగు రోజులుగా నీటిలో నానుతున్నాయి. నాట్లు వేసిన కొద్ది రోజులకే గోదావరి వరద పెరగడంతో కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరి ఎగపోటు నీరు తన్ని పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద పూర్తిగా తగ్గి మళ్లీ స్లూయిజ్ గేట్ల నుంచి గోదావరి నదిలోకి చేరితే తప్ప పొలాలు బయటపడే పరిస్థితి లేదు. ఒక వైపు ఎగపోటు నీటితో పాటు, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు కొండవాగుల నీరు తోడుకావడంతో ముంపు మరింత పెరిగింది. నాట్లు వేసిన పొలాలు నీటి నుంచి బయటపడితే ఎలా ఉంటాయనేది చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు దెబ్బతింటే మళ్లీ వరినారు తెచ్చుకుని నాట్లు వేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


మాజీ ఎమ్మెల్యే బాలారాజును సన్మానిస్తున్న దినేష్, తదితరులు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన బగ్గి దినేష్ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆయన స్వగ్రామమైన దుద్దుకురులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను జిల్లా స్థాయి పదవికి ఎంపిక చేసినందుకు దినేష్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని దినేష్ అన్నారు. అనంతరం బాలరాజును దినేష్‌తో పాటు పలువురు నాయకులు శాలువా కప్పి మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మద్దు సతీష్, కోరం దుర్గారావు, గణేష్, శ్యాంకుమార్, సుభాష్, బీటీ కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల అధ్యక్షుల నియామకం


నూతన కమిటీ అధ్యక్షులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శిగా పారేపల్లి నాగార్జున, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సిర్రా రాజేష్, పంచాయతీ రాజ్ అధ్యక్షుడిగా పత్తిపాటి రాజారావులు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు. తమకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావు, జిల్లా అధ్యక్షుడు డీఎన్‌ఆర్, మండలాధ్యక్షులు ఓరుగంటి నాగేంద్రకుమార్, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన వారిని శ్రీనివాసపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పోల్నాటి ప్రసాద్, చల్లగాలి ఏసు, వసంతాటి శివాజీ, పారేపల్లి నరసింహారావు, ఎలికే సత్తిబాబు, తానిగడప రాజశేఖర్, పోల్నాటి ప్రభాకర్‌రావు తదితరులు సత్కరించారు.

వాహనాల వేగాన్ని నియంత్రించాలి


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న జాన్సన్

భీమడోలు: జాతీయ రహదారిపై స్థానిక కనకదుర్గమ్మ గుడి వద్ద వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని భీమడోలు ఎంపీటీసీ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అధికారులను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కనకదుర్గమ్మ ఆలయంవద్ద తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, క్షతగాత్రులవుతున్నారని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవిలకు వినతిపత్రం అందించారు. రైల్వే గేటు సమీపంలోని కనకదుర్గమ్మ గుడి వద్ద డివైడర్ నుంచి వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వలన రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ డివైడర్ మీదుగా భీమడోలు, చినలింగంపాడు, పెదలింగంపాడు, సాధుగారిదిబ్బ గ్రామాల ప్రజలు, రైతులు ఈ డివైడర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని, ఇది రాంగ్‌రూట్ కావడం వల్ల తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. డివైడర్ వద్ద స్టాపర్లు ఏర్పాటుతోపాటు హోంగార్డును నియమించి, ప్రమాదాలను అరికట్టాలని కోరారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం – మైసన్నగూడెం రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉన్న శ్రీనివాసపురం, మైసన్నగూడెం, ములగలంపల్లి ప్రధాన రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను ప్రచారం చేసుకునేందుకే తప్ప హామీల అమలకు కృషి చేయడం లేదన్నారు. తక్షణమే రహదారిని నిర్మించాలని వారు కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

చింతలపూడి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి చేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జూపూడి వసంత, కొలుకు పాము శ్రీను, చంద్రు కష్ట, బజార్ కష్ట, వెంకటరమణ, మాదాసు రాజారావు, కొమ్మన గోపి తదితరులు పాల్గొన్నారు.